బ్రెయిన్ డెడ్ మహిళ అవయవాల దానం



రమ్య (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామానికి చెందిన బండిగారి రమ్య బ్రెయిన్ డెడ్ కావడంతో ఆమె అవయవాలను కుటుంబ సభ్యులు జీవన్‌ధార సంస్థ ద్వారా దానం చేశారు. గత సోమవారం తలనొప్పితో బాధపడుతున్న రమ్య మలక్‌పేటలోని యశోద ఆసుపత్రికి వెళ్లింది. ఆసుపత్రిలో చేరిన కొన్ని గంటల్లోనే ఆమె కోమాలోకి వెళ్లింది. మూడు రోజుల పాటు పరీక్షలు నిర్వహించిన వైద్యులు రమ్యకు బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. దాంతో ఆమె కుటుంబ సభ్యులు జీవన్‌ధార సంస్థ ద్వారా శుక్రవారం అవయవాలను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం బాటసింగారంలో ఆమె అంత్యక్రియలు ముగిశాయి.



భవన నిర్మాణ కార్మికులకు లేబర్‌కార్డులను అందజేస్తున్న రఘువీర్‌రెడ్డి

లేబర్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

మన్సూరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులు ప్రతి ఒక్కరూ లేబర్‌కార్డులను తీసుకొని దానివల్ల వచ్చే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని మన్సూరాబాద్ బీఆర్ఎస్ పార్టీ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి సూచించారు. క్రాంతికుమార్ ఆధ్వర్యంలో అంకిత ఎన్‌జీఓ సంస్థ చొరవతో ప్రత్యేకంగా చేయించిన లేబర్‌కార్డులను శనివారం డివిజన్ పరిధిలోని డబుల్‌బెడ్రూంలలో నివసించే భవన నిర్మాణ కార్మికులకు రఘువీర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డబుల్‌బెడ్రూం సంక్షేమ సంఘం నాయకులు, క్రాంతి, బ్రహ్మం, భీమ్‌రాజు, సురేష్, సైదులు ఉన్నారు.

ఇంటర్వ్యూకి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



ఫయాజ్ అహ్మద్

సంతోష్‌నగర్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మణికంఠ వివరాల ప్రకారం.. రియాసత్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఫయాజ్ అహ్మద్ (30) ప్రైవేటు ఉద్యోగి. మే28న ఉదయం 9గంటలకు బెంగళూరులో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్లి వస్తానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లిన అహ్మద్ తిరిగి ఇంటికి రాలేదు. అతని సెల్‌ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో కలత చెందిన కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి మహ్మద్ జాకీర్ సంతోష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ఫత్తుల్లాగూడ గ్రామ సభ్యులు

'మా ఏరియాకు ఆ డ్రైనేజీ లైను కలపనివ్వొద్దు'

మన్సూరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాలకు చెందిన డ్రైనేజీ లైనును అతి చిన్నదైన తమ ప్రాంత డ్రైనేజీ లైనుకు అనుసంధానం చేసి మురుగు సమస్య తలెత్తేలా యత్నిస్తున్నారని ఫత్తుల్లాగూడ విలేజ్ యువజన సంఘం సభ్యులు ఆరోపించారు. ఆ లైనును అనుసంధానం చేయకుండా చొరవ తీసుకోవాలని కోరుతూ శనివారం ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సభ్యులు మాట్లాడుతూ పెద్దఅంబర్‌పేట నగర పంచాయితీ మత్తుగూడలోని పలు కాలనీలకు చెందిన డ్రైనేజీ లైనును ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ ఫత్తుల్లాగూడ గ్రామంలోని కేతన అవెన్యూ వద్ద చిన్నపాటి డ్రైనేజీ లైనుకు అనుసంధానం చేయాలని చూస్తున్నారన్నారు. దీంతో ఫత్తుల్లాగూడ గ్రామంలోని పలు కాలనీలతో పాటు ఇప్పటి వరకు ఎలాంటి కలుషితం కాకుండా ఉన్న ఫత్తుల్లాగూడ చెరువు సైతం డ్రైనేజీ నీటితో కలుషితం కానుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డ్రైనేజీ లైను కలపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కాటేపాక రవికుమార్, జంగయ్య, బాలరాజ్, బాలేందర్, కాటేపాక కిషన్, రమేష్, యాదయ్య ఉన్నారు.



వనస్థలిపురం ఆసుపత్రికి వైద్య పరికరాలను అందిస్తున్న సుమన్ గౌడ్

సమాజశ్రేయస్సు కోసం కృషి చేయాలి: సుమన్ గౌడ్

వనస్థలిపురం,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముద్దగౌని సుమన్ గౌడ్ అన్నారు. వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి అవసరమైన బీపీ మీటర్లు, చిన్నపిల్లలకోసం నెబ్‌లైజర్ మిషన్లతో పాటు ఇతర వైద్య పరికరాలను సుమన్ గౌడ్ శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణ, డాక్టర్ నాగేందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండాలన్నారు. సమాజశ్రేయస్సుకు తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ జయమాల, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దర్శి గోవు మృతి.. అధికారుల నిర్లక్ష్యమే

విద్యుత్ అధికారులే న్యాయం చేయాలని రైతు డిమాండ్



విద్యుదాఘాతంలో మృతి చెందిన దర్శిఆవు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఓ గోవు ప్రాణాలు తీసింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన ఎన్న లక్ష్మారెడ్డి రైతు. శనివారం లక్ష్మారెడ్డికి చెందిన దర్శి గోవు గడ్డిమేస్తూ దేశ్‌ముఖ్ రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్ల పొదలు, తీగలు అల్లుకుపోవడంతో అది గమనించని ఆవు దానికి తాకింది. ఒక్కసారి విద్యుత్ షాక్ తగలడంతో ఎగిరి పడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. దాని విలువ సుమారు రూ. లక్ష ఉంటుందని రైతు తెలిపారు. పలుమార్లు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులే తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



చైతన్యపురిలో రహదారిపై నిలిచిన వర్షపునీరు



దిల్‌సుఖ్‌నగర్‌లో సర్వీసు రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



సిరినగర్ వద్ద రహదారిపై నిలిచిన వర్షపునీరు

కురిసిన వర్షం.. రోడ్లన్నీ జలమయం

చంపాపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం ఓ మోస్తారుగా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. చిన్నపాటి వర్షానికే రహదారుల్లో నీళ్లు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, చంపాపేట, హస్తినాపురం, కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్ ప్రాంతాలలో రహదారులపై పారుతున్న వర్షం నీటితో వాహనాదారుల రాకపోకలకు అంతరాయం కలిగింది. సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలో రోడ్డుపై మోకాలు లోతు వర్షం నీరు వచ్చిచేరింది. ఉదయం నుంచే చిరుజల్లులు కురుస్తుండగా మధ్యాహ్నం కాస్తా అధికంగా కురిసింది. వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. రహదారులపై అక్కడక్కడ వర్షం నీరు నిలిచిపోయింది.



హస్తినాపురం డివిజన్ హుడాభారతినగర్ కాలనీలో..



చంపాపేట చౌరస్తాలో వర్షం నీటిలో ప్రయాణాలు



సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలో వర్షపునీరు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి





మూసారాంబాగ్‌లో నాగదేవతకు పాలు పోస్తున్న భక్తులు



కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ దేవస్థానంలోని నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

చంపాపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చంపాపేట, హస్తినాపురం, మూసారాంబాగ్, సరూర్‌నగర్ తదితర ప్రాంతాలలో ప్రజలు శనివారం నాగులచవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఆయా ప్రాంతాల దేవాలయాలలోని నాగదేవతకు పాలు, నీటితో అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో పెద్ద సంఖ్యలో భక్తులు నాగదేవతకు పూజలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు.

కర్నూల్ బస్సు దుర్ఘటనకు కారణం.. మానవ తప్పిదాలే

మలక్‌పేట ఈస్ట్‌జోన్ ఆర్టీవో కిష్టయ్య



ఎల్.కిష్టయ్య, ఆర్టీవో, ఈస్ట్‌జోన్ మలక్‌పేట

చాదర్‌ఘాట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దాదాపు 20 మంది ప్రాణాలను బలిగొన్న కర్నూల్ బస్సు దుర్ఘటనను పరిశీలిస్తే పూర్తిగా మానవ తప్పిదాలే కారణమనే విషయాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయని మలక్‌పేట ఈస్ట్‌జోన్ ఆర్టీవో ఎల్.కిష్టయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. కర్నూల్ బస్సు దుర్ఘటనపై ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ, ఇలాంటి దుర్ఘటనలకు మూడు కారణాలుంటాయన్నారు. అందులో మొదటిది రోడ్డు కండీషన్, రెండోది వెహికల్ కండీషన్, మూడోది మానవ తప్పిదాలు. బస్సును ఎంత వేగంగా నడుపుతున్నామనేది ముఖ్యం కాదని, దాన్ని నడిపే డ్రైవర్ అదుపులో ఉందా లేదా? అనేది ముఖ్యమన్నారు. జాతీయ రహదారిపై అర్ధరాత్రి నిర్మానుష్య సమయంలో అతివేగంగా వెళ్లడమే మొదటి తప్పు. రోడ్డు భద్రతా నిబంధనల ప్రకారం ఏదేని హై వే రోడ్డులో 80 కి.మీ మించి ఏ వాహనం వేగంగా వెళ్లరాదు. కానీ ఈరోజుల్లో హై స్పీడ్ వెహికల్‌లు రోడ్డు పైకి వస్తున్నాయి. పరిమితికి మించిన వేగంతో నడుపుతున్నారు. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడే అతివేగంతో వాహనాలను నడుపుతున్న విషయాలు బయటపడుతున్నాయని ఆయన వెల్లడించారు.

మితిమీరిన వేగంతో..

ప్రైవేటు ట్రావెల్ బస్సుల యాజమానులు నగరం నుంచి అంతర్ రాష్ట్రాలకు నడుపుతున్న బస్సులను ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని త్వరగా చేరవేయాలన్న ఆతృతలో పరిమితమైన సమయంలో మితిమీరిన వేగంతో వెళ్లేందుకు డ్రైవర్లపై వత్తిడి చేయడం కూడా ఇలాంటి దుర్ఘటనలకు కారణాలుగా నిలుస్తున్నాయని ఆర్టీవో కిష్టయ్య అభిప్రాయపడ్డారు. చాలా మంది ప్రైవేటు ట్రావెల్ బస్సుల యాజమానులు క్వాలిఫైడ్ డ్రైవర్లను నియమించుకోకుండా తక్కువ వేతనాలను చెల్లిస్తూ మితిమీరిన వేగంతో నడిపే డ్రైవర్లను నియమించుకుంటున్నారని, ఇలాంటి లోపాలు.. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడే వెలుగులోకి వస్తున్నాయన్నారు. 50 ఏళ్ల వయస్సు దాటిన డ్రైవర్లకు ప్రతి మూడు మాసాలకు ఒకసారి కంటి పరీక్షలతోపాటు ఆరోగ్య పరీక్షలు చేయించాలి. ఆయా డ్రైవర్ల ఆరోగ్య స్థితిగతుల మేరకు హైవే రోడ్డులో బస్సులను నడిపేందుకు నియమించుకోవాలన్న నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. వేగంగా హైవే రోడ్డు బస్సును నడిపే సమయంలో ఏమైనా అడ్డువచ్చినా ఎలాంటి ఘటన జరిగినా రెండు సెకండ్లలోనే బస్సును అదుపు చేసే ఆలోచనలో డ్రైవర్లు ఉండేలా ప్రతీ నిత్యం శిక్షణ నిస్తూ అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కేంద్రం వైఖరి ప్రకటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం వైఖరిని ప్రకటించాలని బీసీ స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ కొమ్మనబోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం కేంద్రం ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ గౌరవ అధ్యక్షుడు జంపాల రాజేష్, సలహాదారులు వలిగొండ నరసింహ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెడితే అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయన్నారు. కేంద్రం ప్రభుత్వం కూడా శీతకాల సమావేశంలో బిల్లును ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రం మంత్రులు, ఎంపీలు అందరూ ఈ విషయంపై ప్రధానిపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే రాజీనామాలు చేయడానికైనా సిద్ధం కావాలని పేర్కొన్నారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ స్టూడెంట్స్ జేఏసీ నాయకులు

హెల్మెట్ పెట్టుకోండి.. ప్రాణాలు కాపాడుకోండి

టీటీఐ ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్



కౌన్సెలింగ్ ఇస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి



వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను గుర్తుచేస్తున్న టీటీఐ ఏఎస్ఐ సోమ్‌నాథ్

కొత్తపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వాహనదారులు హెల్మెట్ పెట్టుకుని ప్రాణాలు కాపాడుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం టీటీఐ అధికారులు కొత్తపేట చౌరస్తాలో సరూర్‌నగర్ పానినీయ మహావిద్యాలయం విద్యార్థులతో కలిసి వాహనదారుల సురక్షిత ప్రయాణం కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీటీఐ సిబ్బందితో కలిసి విద్యార్థులు నిబంధనలు ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. హెల్మెట్ / సీటు బెల్టు ధరించాలని వాహనదారులకు రోజా పూలను అందజేశారు. ఈ సందర్భంగా, ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఏఎస్ఐ సోమ్‌నాథ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాటితో ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని విజ్ఞప్తి చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని గుర్తించాలని కోరారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, పరిమితిని మించి వేగంతో వాహనాలు నడపడం, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడప వద్దని కోరారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనతోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని రాచకొండ టీటీఐ ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్ అన్నారు. శనివారం ఆయన టీటీఐలో అధికారులతో కలిసి 12 ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. తర్వాత వారు టీటీఐలో మాట్లాడుతూ, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కొత్తపేట, సరూర్‌నగర్, ఎల్బీనగర్, నాగోల్ కూడళ్లలో వాహనదారులకు 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమాల్లో 525 మందికి ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారని తెలిపారు.

మద్యం ప్రియులకి కౌన్సెలింగ్

రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 37 మంది మద్యం ప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శనివారం పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్‌హాల్‌లో మూడు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడంతో చోటుచేసుకున్న ప్రమాదాల వీడియో క్లిప్పులను ప్రదర్శించారు.



నాగోల్ చెరువు వద్ద కొలనును పరిశీలిస్తున్న చింతల సురేంద్రనాథ్‌యాదవ్

'ఛత్‌పూజ'కు నాగోలు కొలను సిద్ధం

మన్సూరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మార్వాడీల ప్రధాన పండుగల్లో ఒకటైన ఛత్‌పూజ వేడుకలకు నాగోల్ చెరువు వద్ద గల కొలను సిద్ధమవుతోందని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ అన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శనివారం కొలను వద్ద చేపడుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్‌యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు మార్వాడీల ఛత్‌పూజ వేడుకలు నిర్వహించుకోనున్నారన్నారు. నాగోల్ ప్రాంతంలో మార్వాడీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నందున వారి సాంప్రదాయాన్ని గౌరవిస్తూ నాగోల్ చెరువు వద్ద కొలనును సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీ గణేష్ దేవాలయంలో కార్తీకమాస విశేష పూజలు

వనస్థలిపురం,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని ప్రసిద్ధ శ్రీగణేష్ దేవాలయంలో కార్తీక మాస విశేష పూజలు జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం నాగుల చవితిని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి వీ.వీ.కే సోమయాజులు మాట్లాడుతూ కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రేపు కలెక్టర్ కార్యాలయం ఎదుట 'పెన్షనర్ల' నిరసన

హయత్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. రిటైర్ అయి సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిలను ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో పెద్ద ఎత్తున రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న సేఫ్ ఫౌండేషన్ సభ్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సంతోష్‌నగర్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ సింగరేణి కాలనీలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సేఫ్ ఫౌండేషన్, జనహిత సేవ ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, యూత్ ఫర్ సేవా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కిమ్స్ ఆసుపత్రి నుంచి జనరల్ ఫిజీషియన్, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్ వైద్యులు 300 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి ఐరన్ టాబ్లెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవాట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, కృష్ణమనోహర్, సేఫ్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ పావని, శ్రీను, వలీసాహెబ్, నర్సింగ్‌రావు, విక్రం, మల్లారెడ్డి, ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఘనంగా 'భగినీ హస్త భోజనం'

హాజరైన ఎంపీ ఈటల రాజేందర్



భగినీ హస్తభోజనం చేస్తున్న కాలనీ ప్రజలు

మల్కాజిగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి అనంతరం అన్నదమ్ములను తమతమ ఇళ్లకు ఆహ్వానించి సహపంక్తి భోజనాలకు సోదరీ మణులు ఆహ్వానించే భగినీ హస్త భోజనం (బావుబీజ్) శనివారం మల్కాజిగిరిలో ఘనంగా జరిగింది. బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి జీడీ బాలచందర్ గౌడ్ ఆధ్వర్యంలో సర్ధార్‌పటేల్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు శ్రీ సాయిదత్త పీఠాధిపతులు శ్రీ రామనందప్రభుజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన పలువురికి భగినీ హస్తభోజనాన్ని ఏర్పాటుచేశారు. పీఠాధిపతులు శ్రీ రామచంద్రప్రభూజీ, ఎంపీ ఈటల మాట్లాడుతూ కార్తీక మాసంలో భాగంగా శాస్త్రపురాణాలు చెపుతూ ఇంతటి విశేషం గల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కాలనీ ప్రజలందరికి భగినీ హస్తభోజనం ఏర్పాటుచేసిన జీడీ బాలచందర్‌గౌడ్‌ను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల మన సంస్కృతి, సాంప్రదాయాలు భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గంపా నాగేశ్వర్ రావు, సూర్యనారాయణమూర్తి, రామకృష్ణ, జూలూరి శ్రీనివాసులు, దేవదాసు, ఆర్కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న నీతి ఆయోగ్ సభ్యుడు వికే సారస్వత్

కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలి

●నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్

అల్వాల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భరత అనేది ఆయుధ వ్యవస్థల పరిశోధనలో ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా సాధ్యమవుతుందని నీతి ఆయోగ్ సభ్యుడు పద్మభూషణ్ డాక్టర్ వికే సారస్వత్ అన్నారు. శనివారం హైదరాబాద్ "ఇన్నోవేషన్ రికానసెన్స్" ద్వారా ఉత్పత్తి కోసం వ్యవస్థల స్వదేశీకరణ (ఇన్‌స్పైర్-2025) వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా మారుస్తుందన్నారు. డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్. సమీర్ కామత్ మాటాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే ఆధునిక పరిశోధన, ఆవిష్కరణలపై నిరంతరంగా దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఆయన హైలెట్ చేశారు.